క్లుప్తంగా

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రసమయి

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 18 మంది లబ్ధిదారులకు మంజూరైన 9.80లక్షల రూపాయల చెక్కులను బెజ్జంకి మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అందజేశారు. బాధిత కుటుంబాలకు ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ నిధులు ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ నిర్మల, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు లక్ష్మారెడ్డి, రమేశ్, శ్రీనివాస్‌గౌడ్, తిరుపతిరెడ్డి, లక్ష్మి, లక్ష్మణ్, తిరుపతి, దేవయ్య, మల్లేశం, భూమయ్య, అంజన్న, రాము తదితరులు పాల్గొన్నారు.

రిజర్వాయర్ నీటితో రైతులకు ప్రయోజనం



తూము నుంచి నీటిని వదులుతున్న సర్పంచ్ నర్సింగరావు

బెజ్జంకి(సిద్దిపేట): పంట పొలాలకు సాగునీటిని అందించేందుకు తోటపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి సర్పంచ్ బోయినిపెల్లి నర్సింగరావు శనివారం కుడి, ఎడమ తూములు ఎత్తి కాల్వల ద్వారా నీటిని వదిలారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ఈ నీటితో రైతులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో రైతులు సతీశ్, నర్సయ్య, శ్రీనివాస్, కనకయ్య, అనిల్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ కీర్తి

కోహెడరూరల్(హుస్నాబాద్): గ్రామాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని ఎంపీపీ కొక్కుల కీర్తి అన్నారు. మండలంలోని కూరెల్ల గ్రామంలో 10 లక్షల రూపాయలతో నిర్మించనున్న సీసీరోడ్డు పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి కర్ర శ్రీహరి, సర్పంచ్ గాజుల రమేశ్, మాజీ ఎంపీపీ తిప్పరపు శ్రీకాంత్, ఎంపీటీసీలు జాగిరి కుమారస్వామిగౌడ్, శేఖర్ తదితరులు ఉన్నారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని వరికోలు గ్రామంలో సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌ల చిత్రపటాలకు రజక సంఘం ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు కులవృత్తుల వారికి లక్ష రూపాయల చొప్పున ఆర్థికసాయం అందిస్తున్న కేసీఆర్‌కు జై అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పరశురాంగౌడ్, సంది శ్రీనివాస్‌రెడ్డి, బోయిని రామయ్య, బత్తిని తిరుపతిగౌడ్, రాజయ్య, పైడిపల్లి సంపత్, భూపతి తదితరులు ఉన్నారు.

హోం కంపోస్ట్‌పై అవగాహన

సిద్దిపేటజోన్: పట్టణంలోని స్వచ్ఛ బడిలో మంత్రి హరీశ్‌రావు సూచన మేరకు ప్రతి శనివారం హోం కంపోస్ట్ ప్రక్రియపై అవగాహన కల్పిస్తున్నారు. అందులో భాగంగానే 25వ వార్డులోని మహిళా సంఘాల సభ్యులకు చెత్త విభజన, దాని ప్రాముఖ్యత గురించి వివరించారు. కార్యక్రమంలో స్వచ్ఛ బడి నిర్వాహకులు కౌన్సిలర్ దీప్తి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వనిత, కౌన్సిలర్ యోగి పాల్గొన్నారు.

బండ ప్రకాశ్‌ను కలిసిన ముదిరాజ్ నాయకులు

మర్కూక్(గజ్వేల్): శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్‌ను శనివారం నాచారం ఆలయ మాజీ చైర్మన్, ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకుడు కొట్టాల యాదగిరి, మర్కూక్ మండల నాయకులు సత్యనారాయణ, భాస్కర్‌లు హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా ముదిరాజ్ కులస్తులంతా మత్స్యకారుల సొసైటీల్లో తప్పకుండా సభ్యత్వం తీసుకోవాలని సూచించారు. సభ్యత్వం ఉంటే ప్రభుత్వం ముదిరాజ్‌లకు కల్పిస్తున్న రాయితీ అవకాశాలు ఉంటాయన్నారు. గ్రామాల్లో ప్రతి ఒక్కరూ సభ్యత్వం తీసుకునేలా కృషి చేయాలని వారికి సూచించినట్లు తెలిపారు.

నిర్మించారు.. తీసేశారు!

- గండిపల్లి ప్రాజెక్టుకు నీటిని తరలించే పైపులైన్ తొలగింపు
- లక్షల ప్రజాధనం బూడిదపాలు
- కట్ట చివర కొత్తగా పంప్‌హౌస్ నిర్మాణానికి ప్రణాళిక
- అనుమతి రాకపోవడంతో ప్రారంభం కాని పనులు



గండిపల్లి ప్రాజెక్టుకు నీటిని తరలించేందుకు ఏర్పాటు చేసిన పైపులైన్



సేవ్యానాయక్‌తండా వద్ద ఏర్పాటు చేసిన పంప్‌హౌస్



పైపులైన్‌ను తొలగించిన దృశ్యం

అక్కన్నపేట(హుస్నాబాద్): 'రాజుల సొమ్ము రాళ్ల పాలు' అన్న చందంగా గండిపల్లి ప్రాజెక్టుకు నీటిని తరలించే పైపులైన్‌లను ఏర్పాటు చేసిన తర్వాత తీసేశారు. ఈ పైపులైన్ నిర్మాణానికి రూ.లక్షల్లో నిధులు వెచ్చించారు. అక్కన్నపేట మండలం గౌరవెల్లి ప్రాజెక్టు నుంచి గండిపల్లి ప్రాజెక్టుకు నీటిని తరలించేందుకు పైపులైన్‌ను నిర్మించారు. ముంపు గుడాటిపల్లి గ్రామ పరిధిలోని సేవ్యానాయక్ తండా వద్ద పంప్‌హౌస్‌ను ఏర్పాటు చేసి అక్కడి నుంచి పైపులైన్‌ను ఏర్పాటు చేశారు. ఇదంతా గౌరవెల్లి ప్రాజెక్ట్ 1.41టీఎంసీల సామర్థ్యం ఉన్నప్పుడు పనులను పూర్తి చేశారు. కాగా 2015లో తెలంగాణ ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత సీఎం కేసీఆర్ గౌరవెల్లి ప్రాజెక్టును సందర్శించి సామర్థ్యం 8.23టీఎంసీలకు పెంచారు. దీంతో సామర్థ్యం పెంపుతో అప్పటికే ఏర్పాటు చేసిన పైపులైన్ కొంతమేర మునిగిపోయింది. దీంతో వారం, పదిరోజుల క్రితం నీటిని తరలించే పైపులైన్‌ను పెద్ద యంత్రాల సహాయంతో పూర్తిగా తొలగించారు. సేవ్యానాయక్‌తండా నుంచి ప్రాజెక్టు చివర అంటే కుందనవానిపల్లి గ్రామ పరిధిలోని సీతారాంతండా సమీపం వరకు పైపులైన్‌ను తీసేశారు. కాగా ప్రాజెక్టు చివర పంప్‌హౌస్‌ను ఏర్పాటు చేసి అక్కడి నుంచి గండిపల్లి ప్రాజెక్టులోకి నీటిని ఎత్తిపోసేందుకు అధికారులు ప్రణాళికలను రూపొందిస్తున్నారు. కానీ ఇప్పటివరకు అక్కడ పంప్‌హౌస్ నిర్మాణానికి సంబంధించి ఎలాంటి పనులు ప్రారంభం కాలేదు. ఇప్పటికే గౌరవెల్లి, గండిపల్లి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేసి దాదాపు 15ఏళ్లు గడుస్తోంది. ఈ క్రమంలో గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తిదశకు చేరుకొని గోదావరి జలాలతో నింపుతున్నారు. కానీ ఇంకా గండిపల్లి ప్రాజెక్టుకు సంబంధించిన పనులు మొదలు కాలేదు. ఈ నేపథ్యంలో నీటిని తరలించే పైపులైన్ తొలగించడం, పంప్‌హౌస్ నిర్మాణ పనులు మొదలు కాకపోవడంపై విమర్శలు వెలువెత్తుతున్నాయి.

పైపులైన్ మునిగిపోతుందని తీసేస్తున్నాం..

గౌరవెల్లి ప్రాజెక్టు 1.41టీఎంసీ ఉన్నప్పుడు పైపులైన్ ఏర్పాటు చేశారు. తర్వాత ప్రాజెక్టు సామర్థ్యం పెంచడంతో పైపులైన్ మునిగిపోతుందని తీసేస్తున్నాం. ప్రాజెక్టు కట్ట చివర కొత్తగా పంప్‌హౌస్‌ను నిర్మించి తద్వారా గండిపల్లి ప్రాజెక్టుకు పైపులైన్ ద్వారా నీటిని తరలిస్తాం. కానీ ఇంకా పంప్‌హౌస్ నిర్మాణానికి అనుమతులు రాలేదు.

–రమ్యశ్రీ, ఇరిగేషన్ ఏఈ

దేశానికే అన్నం పెట్టే స్థాయిలో తెలంగాణ

ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి



అచ్చుమాయిపల్లిలో అమ్మవారికి పూజలు చేస్తున్న ఎంపీ ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాకటౌన్: దేశానికే అన్నం పెట్టే స్థాయికి రాష్ట్రం ఎదగడం చాలా సంతోషకరమని ఎంపీ, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శనివారం దుబ్బాక పట్టణంతో పాటుగా మండలంలోని పలు గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ముందు చూపుతో శాశ్వత ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టడడంతో నేడు వరిధాన్యం పండించడంలో తెలంగాణ దేశంలోనే అగ్రభాగాన ఉందన్నారు. రైతులు బాగుంటేనే రాజ్యం బాగుంటుందన్న సంకల్పంతో వ్యవసాయరంగ అభివృద్ధికి సీఎం కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కడతల రవీందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్‌లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు ఉన్నారు. అదేవిధంగా అచ్చుమాయిపల్లి గ్రామంలో గ్రామదేవతల విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాల్లో ఎంపీ ప్రభాకర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధికి రూ.10లక్షలు మంజూరు చేస్తానని హామీనిచ్చారు. పద్మనాభునిపల్లి సర్పంచ్ పరశురాములు తండ్రి రాజయ్య ఇటీవల మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని ఎంపీ పరామర్శించారు.

దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

తొగుట(దుబ్బాక): సీఎం కేసీఆర్ సహకారంతో దుబ్బాక నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ముందుకు తీసుకుపోతామని మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని గోవర్ధనగిరి మదిర చిన్న ముత్యంపేట(పిట్టలవాడ)లో శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో నెలకొన్న సమస్యలను ఎంపీ అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రం లేకపోవడంతో చిన్నారులను గోవర్ధనగిరి తీసుకెళ్లాలంటే చాలా ఇబ్బంది పడుతున్నామని ఉపసర్పంచ్ ఇందిర ఎంపీకి విన్నవించారు. గతంలో మాకు 22 డబుల్ ఇళ్లు నిర్మించి అందజేశారని ప్రస్తుతం కుటుంబాల సంఖ్య పెరగడంతో మరిన్ని ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానని హామీనిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ఎల్లం, మల్లయ్య, ఉపసర్పంచ్ ఇందిర, పీఏసీఎస్ చైర్మన్ హరికృష్ణారెడ్డి, ఏఎంసీ చైర్మన్ కొమురయ్య, వైస్ చైర్మన్ రాంరెడ్డి, మండల అధ్యక్షుడు రాంరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

మహంకాళికి ప్రత్యేక పూజలు



మంత్రి హరీశ్‌రావుకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ప్రజాప్రతినిధులు



పూజల్లో పాల్గొన్న 'గడా' ప్రత్యేకాధికారి ముత్యంరెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజమౌళి

గజ్వేల్‌రూరల్: కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారం మహంకాళీ అమ్మ అని గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి పేర్కొన్నారు. పట్టణంలోని మహంకాళీ ఆలయంలో ఆషాఢ మాసం బోనాల ఉత్సవాల్లో భాగంగా రెండోరోజు శనివారం ఆలయంలో మహంకాళీ అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమివ్వగా ఆలయ ప్రధాన అర్చకుడు చాడ నందబాలశర్మ వైదిక నిర్వహణలో ప్రత్యేక పూజలు నిర్వహించి హోమం జరిపించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ రాజమౌళితో పాటు గడా ప్రత్యేకాధికారి ముత్యంరెడ్డి, మున్సిపల్ కమిషనర్ విద్యాధర్‌లు అమ్మవారిని దర్శించుకొని పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం రాజమౌళి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఆలయాల అభివృద్ధితో పాటు దీప, దూప, నైవేద్యాల కోసం నిధులను మంజూరు చేస్తున్నారని గుర్తు చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. ఆదివారం గజ్వేల్‌లో జరిగే బోనాల ఉత్సవాలకు రావాలని మంత్రి హరీశ్‌రావు, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిలకు ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, భక్తులు పాల్గొన్నారు.

డ్రైవింగ్ లైసెన్స్‌కు దరఖాస్తు చేసుకోవాలి

దుబ్బాకటౌన్: దుబ్బాక నియోజకవర్గంలో 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులకు ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి సహకారంతో ఉచితంగా టూ వీలర్, ఫోర్ వీలర్ డ్రైవింగ్ లైసెన్స్‌లు ఇప్పించడంతో పాటు హెల్మెట్‌లు పంపిణీ చేస్తామని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి శేఖర్‌గౌడ్, దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి పాపని సురేష్‌గౌడ్ అన్నారు. శనివారం దుబ్బాక పట్టణంలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. జూలై 4 నుంచి 13వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు దుబ్బాక ఎంపీ కార్యాలయంలో ఆధార్ కార్డు, 2 పాస్ ఫొటోలు, బర్త్ సర్టిఫికెట్ లేదా టెన్త్ సర్టిఫికెట్‌తో కలిపి దరఖాస్తులు సమర్పించుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని దుబ్బాక నియోజకవర్గంలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో నాయకులు రాంప్రసాద్, గుడికందుల రాజేందర్‌రెడ్డి, ప్రేమ్, కుమార్, నవీన్, రాకేశ్, రాజు, ప్రసాద్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

మంత్రి కేటీఆర్ క్షమాపణ చెప్పాలి



నిరసన తెలుపుతున్న మేరు కులస్తులు

నంగునూరు(సిద్దిపేట): మేరు కులస్తులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మంత్రి కేటీఆర్ క్షమాపణ చెప్పాలని సంఘం మండల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం నంగునూరులో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మహబూబాబాద్ సభలో మేరు కులస్తులను మోసగాళ్లుగా, దొంగలుగా అభివర్ణించి మంత్రి అవమానించాడన్నారు. వెంటనే క్షమాపణ చెప్పాలని లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామన్నారు. కార్యక్రమంలో రాజయ్య, వెంకటాద్రి, లక్ష్మినర్సయ్య, బేగిరావ్, రాజు, నర్సింలు, శ్రీధర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరికాయల విక్రయానికి లైసెన్స్‌లు తీసుకోవాలి

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని కొమురవెల్లి గ్రామ పంచాయతీలో సర్పంచ్ సార్ల లత అధ్యక్షతన శనివారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేశారు. అనంతరం సర్పంచ్ సార్ల లత మాట్లాడుతూ.. కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయం వద్ద ప్రతి సంవత్సరం కొబ్బరికాయలు విక్రయించేందుకు టెండర్ నిర్వహించేవారని, ఈ సంవత్సరం టెండర్ రద్దు చేయడంతో కొబ్బరికాయలు విక్రయించేవారు గ్రామ పంచాయతీ ద్వారా లైసెన్స్‌ను పొందాలన్నారు. లైసెన్స్‌ల ద్వారా వచ్చే ఆదాయాన్ని గ్రామ అభివృద్ధికి ఉపయోగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సిద్దప్ప, వార్డుసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్ రోటరీ క్లబ్ సేవలు అభినందనీయం



వీడ్కోలు సభలో అసిస్టెంట్ గవర్నర్, క్లబ్ సభ్యులు

ములుగు(గజ్వేల్): సామాజిక సేవా కార్యక్రమాల్లో గజ్వేల్ రోటరీ క్లబ్ చేస్తున్న కృషి ఎనలేనిదని రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ (3150) కె.కరుణాకర్‌రెడ్డి పేర్కొన్నారు. గజ్వేల్ రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఎ.బాపురెడ్డి పదవీ విరమణ సందర్భంగా శుక్రవారం రాత్రి ములుగులో ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్లబ్ సభ్యులు సొంత డబ్బులను ఖర్చు చేసి నిరుపేదలకు సేవ చేయడం అభినందనీయమని ప్రశంసించారు. ఇంకా మరెన్నో సేవా కార్యక్రమాలతో క్లబ్ ముందుకు సాగుతూ ఆదర్శంగా నిలవాలని కొనియాడారు. కార్యక్రమంలో గ్రామ వికాస్ చైర్మన్ చంటి, క్లబ్ కార్యదర్శి కె.బాబుగౌడ్, ట్రెజరర్ నర్సింహారెడ్డి, మాజీ అధ్యక్షుడు డాక్టర్.పురుషోత్తం, జగదీశ్వర్, నర్సింహ్మారెడ్డి, సభ్యులు కె.నరేశ్‌గౌడ్, పాండుగౌడ్, భూపాల్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, బాల్‌రాజ్, శ్రీనివాస్‌గౌడ్, మల్లేశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల సేవలు ఎనలేనివి



గజ్వేల్‌లో వైద్యులను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు



దుబ్బాక ఆస్పత్రి సూపరింటెండెంట్ హేమరాజ్‌సింగ్‌ను సన్మానిస్తున్న క్లబ్ ప్రతినిధులు

గజ్వేల్‌రూరల్: ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రులకు వచ్చే వారికి వైద్యులు అందించే సేవలు ఎనలేనివని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి పేర్కొన్నారు. జాతీయ డాక్టర్స్ డేను పురస్కరించుకొని శనివారం గజ్వేల్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డితో పాటు పలువురు వైద్యులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో నిర్వహించిన వైద్య శిబిరంలో ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు శ్యామలమల్లేశం, లక్ష్మికిషన్‌రెడ్డి, మెట్టయ్య, లయన్స్ క్లబ్ ఆఫ్ గజ్వేల్ స్నేహ అధ్యక్షుడు మతిన్, కొండపోచమ్మ దేవస్థాన కమిటీ డైరెక్టర్ సంతోష్, ఐఎంఏ గజ్వేల్ శాఖ అధ్యక్షుడు డాక్టర్ లింగం, లయన్స్ క్లబ్ సభ్యులు పరమేశ్వరచారి, రాంఫణిధర్‌రావు, రాధాకృష్ణ, సంజయ్‌గుప్త, ఎల్లం రాజు, వైద్యులు పాల్గొన్నారు.

దుబ్బాకటౌన్: అంకితభావంతో పనిచేసే ప్రతీ వైద్యుడు దైవంతో సమానమని సిద్దిపేట లయన్స్ క్లబ్ కార్యదర్శి నిర్మల రాణి అన్నారు. శనివారం దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రిలో సూపరింటెండెంట్, ప్రముఖ సర్జన్ డాక్టర్ హేమరాజ్‌సింగ్‌ను లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో చింత నాగేందర్, సీబీ శ్రీనివాస్, వడ్లకొండ శ్రీధర్, ఆస్పత్రి సిబ్బంది తదితరులు ఉన్నారు.

జగదేవ్‌పూర్(గజ్వేల్): లయన్స్ క్లబ్ ఆఫ్ మిత్ర ఆధ్వర్యంలో తిగుల్, జగదేవ్‌పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల డాక్టర్లు సత్యప్రకాశ్, రాజశేఖర్‌లకు షీల్డ్‌లు అందించి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. అదేవిధంగా జగదేవ్‌పూర్‌లో ఆర్‌ఎంపీ వైద్యులను సన్మానించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, ఉపసర్పంచ్ మల్లేశం, క్లబ్ మండల అధ్యక్షుడు నాగరాజు, సభ్యులు కిరణ్‌గౌడ్, ఐలం, ప్రవీణ్, వైద్యులు పాల్గొన్నారు.

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి, తోటపల్లి ఆరోగ్య కేంద్రాల్లో శనివారం వైద్యులను ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు శాలువాలు కప్పి సన్మానించారు. అనంతరం కేక్‌లు కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ వినోద్‌బాబ్జి, కృష్ణతేజ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ డివిజన్ సాధనకు అందరూ కలిసిరావాలి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ కొండల్‌రెడ్డి

మద్దూరు(హుస్నాబాద్): చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధనకు ఓ బలమైన ఉద్యమాన్ని నిర్మిద్దామని జెడ్పీటీసీ కొండల్‌రెడ్డి, జేఏసీ చైర్మన్ పరమేశ్వర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. డివిజన్ ఏర్పాటుకు అన్నీ గ్రామాల్లో కమిటీలను నియమించాలన్నారు. కొన్ని సంవత్సరాలుగా చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు పోరాటాలు, గ్రామ పంచాయతీల నుంచి తీర్మానాలు చేసి ఎమ్మెల్యేలకు ఇచ్చినా పట్టించుకోవడం లేదన్నారు. నియోజకవర్గాన్ని ముక్కలు చేసి ప్రజలను అన్యాయం చేశారని మండిపడ్డారు. చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు అన్ని అర్హతలు కలిగి ఉందన్నారు. డివిజన్ సాధనకు చేస్తున్న పోరుబాటలో ప్రతి ఒక్కరూ కలిసిరావాలని సూచించారు. కార్యక్రమంలో జేఏసీ కో–చైర్మన్ పూర్మ ఆగంరెడ్డి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అశోక్, నాయకులు మహేందర్, బండి శ్రీనివాస్, బాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల 12శాతం రిజర్వేషన్లు ఏవి?



గిరిజనులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్‌రెడ్డి

మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి

హుస్నాబాద్‌రూరల్: రాష్ట్రం వచ్చిన తర్వాత గిరిజనులకు ఒరిగింది ఏమి లేదని, గిరిజనులకు 12 శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పిన కేసీఆర్ ఇప్పటి వరకు అమలు చేయలేదని మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి ఆరోపించారు. శనివారం సాయంత్రం వంగరామయ్యపల్లిలో గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమంలో పాల్గొని పూల్‌నాయక్ తండాలోని గిరిజనుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌రెడ్డి మాట్లాడుతూ.. గిరిజనుల సమస్యలను ప్రభుత్వం విస్మరించిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత గిరిజన సంక్షేమం కోసం ప్రత్యేక ప్యాకేజీ కేటాయించి అభివృద్ధి చేస్తామని భరోసా కల్పించారు. వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ శివయ్య, మండల అధ్యక్షుడు చందు, లింగమూర్తి పాల్గొన్నారు.

గ్రూప్–4 పరీక్ష ప్రశాంతం

- ఆలస్యంగా వచ్చిన వారిని అనుమతించని అధికారులు
- నిరాశతో వెనుదిరిగిన అభ్యర్థులు



గజ్వేల్ బాలికల ఎడ్యుకేషన్ వద్ద లోపలికి అనుమతించాలని వేడుకుంటున్న అభ్యర్థులు



హుస్నాబాద్: ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులను లోపలికి అనుమతి ఇవ్వని ఏసీపీ సతీశ్

హుస్నాబాద్: హుస్నాబాద్ పట్టణంలో శనివారం 8 సెంటర్లలో నిర్వహించిన గ్రూప్ 4 పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పాలిటెక్నిక్ కళాశాలలో ఒకరు, మోడల్ స్కూల్‌లో ఒకరు, సెయింట్ జోసఫ్ పాఠశాల కేంద్రంలో ఇద్దరు అభ్యర్థులు ఆలస్యంగా వచ్చారు. బస్సు ప్రయాణంలో ఆలస్యం జరిగిందని చెప్పిన అధికారులు వినలేదు. అభ్యర్థులు బతిమిలాడిన అధికారులు పరీక్షా కేంద్రాల్లోకి అనుమతివ్వకపోవడంతో చేసేది ఏమి లేక వెనుదిరిగి వెళ్లిపోయారు. పలు పరీక్షా కేంద్రాలను అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ జియా ఉన్నీసాబేగం సందర్శించారు. ఏసీపీ సతీశ్, సీఐ కిరణ్‌ల పర్యవేక్షణలో బందోబస్తు నిర్వహించారు.

శభాష్ కానిస్టేబుల్..

పరీక్ష రాసేందుకు 5 నెలల పసిబిడ్డతో ఓ మహిళ పట్టణంలోని సంఘమిత్ర బీఈడీ కళాశాల సెంటర్‌కు వచ్చింది. ఆ సమయంలో భర్త బయటకు ఏదో పనిపై వెళ్లడం, పరీక్ష సమయం దగ్గరపడటంతో హైరాన పడుతుండగా, అక్కడే విధులు నిర్వహిస్తున్న ఓ మహిళా కానిస్టేబుల్ గమనించి, పాప క్షేమంగా చూసుకుంటానని భరోసానిచ్చి పరీక్ష రాసేందుకు ఆ మహిళను పంపించింది. తల్లి పరీక్షా కేంద్రంలో, బిడ్డ మహిళా కానిస్టేబుల్ ఒడిలో పెట్టుకొని ఆడిస్తున్న ఈ సన్నివేశాన్ని చూసిన వారందరూ శభాష్ కానిస్టేబుల్ అంటూ అభినందించారు.

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి శివారులోని ఎల్లంపల్లెలో గల మోడల్ స్కూల్ పరీక్షా కేంద్రంలో హైదరాబాద్ నుంచి వచ్చిన ఒక మహిళా అభ్యర్థి గుర్తింపు కార్డులేక పోగా, మరో ఇద్దరు ఆలస్యంగా రావడంతో ముగ్గురిని కేంద్రంలోకి అనుమతించలేదు.

సిద్దిపేటఅర్బన్: ఇందూరు ఇంజినీరింగ్ కళాశాలలో ఉదయం పరీక్షకు ముగ్గురు అభ్యర్థులు, మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు ముగ్గురు అభ్యర్థులు ఆలస్యంగా రాగా అధికారులు అనుమతించలేదు.



హుస్నాబాద్‌లో మహిళా కానిస్టేబుల్ ఒడిలో పసిబిడ్డ

చిన్నకోడూరు(సిద్దిపేట): మండలంలోని మూడు కేంద్రాల్లో నలుగురు విద్యార్థులు ఆలస్యంగా రావడంతో వారిని పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించలేదు.

గజ్వేల్‌రూరల్: గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో అభ్యర్థులకు కొన్ని కళాశాలల అడ్రస్ తెలియకపోవడంతో అయోమయానికి గురయ్యారు. దీంతో పరీక్షా సమయం దాటిపోవడంతో లోపలికి వెళ్లేందుకు పోలీసులు అనుమతి ఇవ్వలేదు. నలుగురు అభ్యర్థులు నిరాశతో వెళ్లిపోయారు.

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలోని ప్రజెంటేషన్ స్కూల్, ప్రతిభ కళాశాలల వద్ద ఆలస్యంగా వచ్చిన ఒక్కొక్కరిని, సాధన కళాశాలలో ఇద్దరు అభ్యర్థులను అనుమతించలేదు.